ప్రజాశక్తి
సోమవారం 30 అక్టోబర్ 2023

150 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి -రంపచోడవరం : రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి వారి అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 150మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరంలో స్వామి రఘువీరనంద మహారాజ్ పాల్గొని. వైద్య సేవలు పర్యవేక్షించారు. డాక్టర్ జి.భాస్కర్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ 'రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈసందర్భంగా 39 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఎక్స్ రేలు, ఏడుగురికి ఫిజియోథెరపీ చేసినట్లు స్వామీజీ తెలిపారు. ప్రతివారం రామకృష్ణ మిషన్గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో అందించే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. వైద్య శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బందిపాల్గొన్నారు.వైద్యశిబిరానికి వచ్చిన రోగులకు, సహాయకులు భోజన సదుపాయం కల్పించారు

పనుల తీరును పరిశీలిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత ధనుంజయ్

జల జీవన్ పనుల్లో

నాణ్యతా ప్రమాణాలు ఏవీ?:ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి-చింతపల్లి:మండలంలోని తాజంగి పంచాయితీ కేంద్రం వద్ద జల్ జీవన్ మిషన్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు జరుగుతున్నాయని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ తెలిపారు. ఆదివారం తాజంగి పంచాయితీ కేంద్రంలో పాత తాజంగి వద్ద జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఆయన పరిశీలించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇంటింటికి కుళాయిలో భాగంగా ఇంటిదాకా ఎవరి గోతులు వారే తవ్వుకోవాలని చెప్పి కాంట్రాక్టర్లు డబ్బులు మిగిలించుకుంటున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తనకు నచ్చిన విధంగా పనులు చేయిస్తున్నారన్నారు.కుళాయిలకు పైపులు వేయటానికి తీస్తున్న గోతులు కనీసం అడుగు లోతు కూడా తీయ లేదన్నారు. అధికారులు పర్యవేక్షణ చేసి తగు చర్యలు తీసుకోకుంటే స్థానికులతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో టిడిపి మండల అధ్యక్షుడు తులసీరావు ఆధ్వర్యంలో కళ్ళు తెరిపిద్దాం నిరసన కార్యక్రమం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పూరితంగానే కక్ష పూరితంగాగా చంద్రబాబుని జైలు లో పెట్టారని తెలిపారు.ప్రభుత్వం ప్రజల పరిపాలన విధానంపై దృష్టి సారించకుండా ప్రతిపక్షాలపై దృష్టి సారించడం సరికాదన్నారు. ప్రతిపక్ష నాయకులపై నిర్బంధాలు, అక్రమ కేసులు బనాయించడం తగదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పలు సమస్యలను ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సూర్యకాంతం, ఎంపీటీసీ కొమ్మ రమ, సర్పంచులు వెంకట రమణ రాజు, పాండు రంగ స్వామి, క్లస్టర్ ఇంచార్జీ మురళి, వార్డు సభ్యులు లక్ష్మి నారాయణ, ఎస్టీ సెల్ సభ్యులు శంకర్, మాజీ సర్పంచ్ రామలింగం, టీడీపీ నాయకులు బాబురావు, కొండలరావు, కోటి స్వామి, వికాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు

యుటిఎఫ్ నూతన కార్యవర్గాల ఎన్నిక

దుంబ్రిగుడలో ఎన్నికైన యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:అనేకమంది త్యాగ ఫలితంగా యుటిఎఫ్ ఆవిర్భావం అయ్యిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు చెప్పారు. మండల కేంద్రంలో ఆదివారం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యుటిఎఫ్ ఒక ఆశయ సాధనకు స్థాపన జరిగిందన్నారు. అనంతరం నూతన మండల కార్యవర్గం ఎన్నికైంది. ప్రస్తుత అధ్యక్షుడు ఎల్.నారాయణ అధ్యక్షతన ఎన్నికల అధికారి టి.చిట్టిబాబు సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా టి.సుబ్బారావు, అధ్యక్షుడిగా కాకారి రాజారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహ అధ్యక్షులుగా ఎం రామకృష్ణ, సహధ్యక్షురాలిగా అర్.పార్వతి , కోశాధికారిగా ఎం.మోహన్, ప్రచార కార్యదర్శిగా ఆర్.మల్లికార్జునరావుతో పాటు కార్యదర్శులుగా జి.దుక్కు, కే.బాబ్జి, కే.ప్రసాద్, బి శ్రావణ్ కుమార్, ఏ.రాము, వి.కృష్ణ, సిపిఎస్ కమిటీ కన్వీనర్గా కె.గెన్ను, ఆడిట్ కమిటీగా టి కోటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, టీ.మేఘనాథ్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్లు కే.రాజారావు, ఎస్.బాలకృష్ణ, ఎస్ కన్నయ్య, బాబురావు, నారాయణ పాల్గొన్నారు.

పెదబయలు: మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం స్థానిక ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో జిల్లా కార్యదర్శి మోస్య, ధర్మారావు ఆధ్వర్యంలో ఎన్నికైంది. మండల స్థాయి అధ్యక్షులుగా గల్లెల సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కిల్లో ఆనంద్, కార్యదర్శులుగా నిక్కుల శ్రీనుబాబు, కొర్ర వెంకటేష్, అడిట్ కమిటీ, జిల్లా కౌన్సిలర్స్గా జె సత్యనారాయణ, గుల్లెల ప్రసాద్, మహిళా కన్వీనర్స్ బాలకుమారి, సభ్యులుగా లక్ష్మీలు ఎన్నికయ్యారు.

అరకులోయ:మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. జిల్లా గౌరవ అధ్యక్షులు టి చిట్టిబాబు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.దేముడు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల యూటీఎఫ్ నూతన గౌరవ అధ్యక్షులుగా టీ.మోహన్ రావు, అధ్యక్షులుగా టి.విజయరావు,ఉపాధ్యక్షులుగా రవికుమార్, జి.సింహాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రామచందర్, కోశాధి కారిగా ఎం.నాగేశ్వరావు, కార్యదర్శులుగా చంద్రశేఖర్, వి.శాంతి, మచ్చులమ్మ, ఎల్బీ కామేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీగా ఎం.శ్రీను, కే.సుబ్బారావు, బి.ముక్తా, జి మహాలక్ష్మి, జిల్లా కౌన్సిలర్గా ఎస్.నారాయణ, ఎస్.రాజ్ కుమార్లు ఎన్నికయ్యారు. సలహాదారులుగా యు.గంగరాజు, ఎస్.దుక్కు నాయుడు, ఎరుకులు, చంద్రమోహన్దాస్, సిపిఎస్ కమిటీలు సభ్యులుగా కుమారి, ఎస్.గంగాధర్, డి.రాజుబాబు, బి.గోపాల్, కె కాంతమ్మ, ఎన్నికయ్యారు.

అరకులో ప్రమాణ స్వీకారం చేస్తున్న నేతలు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు:మండల పరిధిలో అత్యధికంగా వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎస్సై కె.రవీంద్ర పేర్కొన్నారు. ఆదివారం పాడేరు నుండి ముంచింగిపుట్టు వెళ్లే ఆర్అండ్బి ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు మండలంలో గల కుజబంగి, కొత్తూరు కూడళ్ల వద్ద పోలీసులు వేగాన్ని నియంత్రించే డ్రమ్ములు ఏర్పాటు చేసి రేడియం స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా ఎస్సై కె.రవీంద్ర మాట్లాడుతూ వాహనాల వేగాన్ని నియంత్రించి రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు పోలీసు శాఖ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామని అన్నారు. నిత్యం ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో వేగం నివారణ సూచిక డ్రమ్ములు ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. అలాగే వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వెళ్లరాదని సూచించారు. రాంగ్ రూట్ లో వాహనాలు నడపొద్దని వాహనదారులకు ఆయన కోరారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇస్తే యాజమానిపై కేసులు సైతం నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డుపై డ్రమ్ములు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి

4న రేఖపల్లిలో బస్‌యాత్ర, బహిరంగ సభ
హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యనారాయణ

ప్రజాశక్తి -విఆర్ పురం: ప్రజారక్షణభేరి యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు పూనెం సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద పార్టీ ప్రజా ప్రతినిధులు, మండల కమిటీ నాయకులు, ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, ప్రజారక్షణభేరి బస్సు యాత్ర ఈ నెల 5న మధ్యాహ్నం రేఖపల్లి వస్తుందని,ఒంటిగంటకు నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.దేశంలోనూ, రాష్ట్రంలోనూ నెలకొన్న పరిస్థితులు కలవరపరుస్తున్నాయని, ఎవరో వచ్చిఉద్ధరిస్తారని ఎదురుచూసే కన్నా మన బతుకులను, రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గాన నడిపించడానికి ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

ప్రజల మధ్య విద్వేషాలు రాజేస్తోన్న బిజెపి పాలనలో మైనార్టీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికచట్టాలను కాలరాసి, లేబర్ కోడ్‌లతో వారి హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. దేశీయ వ్యవసాయానికి, ప్రజల ఆహార భద్రతకు ముప్పు తెచ్చే నల్ల చట్టాలపై అన్నదాతలు పోరాడి కేంద్రం మెడలు వంచాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు ఏకపక్ష నిర్ణయాలతో రాష్ట్రాల హక్కుల్ని హరించడం, విద్య, వైద్యం ప్రైవేటీకరణతో సామాన్యులకు వాటిని దూరం చేయడం, సామాజిక న్యాయానికి తూట్లు పొడవడం, ప్రభుత్వ రంగాన్ని తెగనమ్ముతూ, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానీలకు దోచిపెట్టడం వంట దేశద్రోహ చర్యలకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. దేశంలో నిరుద్యోగం రికార్డుస్థాయిలో పెరిగిపోతున్నా ఇచ్చిన హామీల అమలులో ప్రధాని మోడీ ముఖం చాటేయడం, ధరాభారంతో ప్రజలంతా అర్థాకలితో అలమిస్తుంటే ప్రధాని మోడీ మాత్రం అచ్చేదిన్ అంటూ భారత్ అభివృద్ధిలో దూసుకుపోతోందంటూపచ్చి అబద్ధాలను వల్లె వేయడం దుర్మార్గమన్నారు. కేంద్రం తీసుకునే ప్రతిచర్య, సంస్కరణలకు తానా అంటే తందానా అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి సై అంటూ కార్పొరేట్ సేవలో తరిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీలు అమలు చేయకపోయినా, రాష్ట్రం హక్కులను కాలరాస్తున్నా కేంద్రాన్ని పల్లెత్తు మాట అనని రాష్ట్రంలోని అధికార వైసిపి తీరుపై ధ్వజమెత్తారు. వీటన్నింటినీ వ్యతిరేకిస్తూ సిపిఎం నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి యాత్ర, సభలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. రేఖపల్లి సభకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు కుంజ నాగిరెడ్డి, ఖాదర్, కొండారెడ్డిర అచ్యుతరావుర ప్రజా ప్రతినిధులు సవల మారయ్య, రేఖపల్లి సర్పంచ్ పూనెం సరోజిని, పెద్దమటపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, రామవరం సర్పంచ్ కారం. బుచ్చమ్మ, లక్ష్మణరావు, ప్రకాశరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి

రెట్టింపైన టమోటా, ఇతర కూరగాయల ధరలు
కొనేవారు లేక వారపుసంతలో వ్యాపారాలు వెలవెల

కొనుగోళ్లు లేక కుప్పలుగా మిగిలి ఉన్న ఉల్లిపాయలు

ప్రజాశక్తి -సీలేరు: ఉల్లి, టమోటాలు, కొన్ని కూరగాయల ధరలు ఒక్కసారిగా రెట్టింపు కావడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం సీలేరు వారపుసంతలో ఉల్లిరేటు అమాంతం పెరిగిపోవడంతో కొనుగోలు చేసే వారు కరువవ్వడంతో వాటిని అమ్మకానికి తెచ్చిన వ్యాపారులు కుప్పలుగా వేసి, మళ్లీ బస్తాలో ఎత్తుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

గతవారం ఉల్లిపాయలు కిలో రూ.30 ఉండగా, ఈ వారం రూ.70లకు పెరిగిపోవడంతో దినసరి కూలీలు, మామూలు ప్రజలు అటువైపు చూడడం మానేశారు. గతవారం టమోటా కిలో రూ.20లకు అమ్ముడుపోతే, ఈ వారం దాని ధర రెట్టింపుపై రూ.40లకు వ్యాపారులు విక్రయించారు. కాలిఫ్లవర్ కిలో రూ.80, అల్లం కిలో రూ.160, పచ్చిమిర్చి రూ.100కు చేరి, గతవారం కంటే గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులు ముఖం చాటేయాల్సిన పరిస్థితి వచ్చింది.

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు వల్ల సాగునీరు అందుబాటులో లేక దుప్పిలివాడ పంచాయతీకి చెందిన మాలీలు కూరగాయలు పూర్తిగా పండించలేని పరిస్థితి ఉంది. గతంలో వీరు పండించి తెచ్చిన కూరగాయలతో సీలేరు వారపుసంతకు వచ్చే కొనుగోలుదారులకు కాస్తా తక్కువధరకు గిట్టుబాటులోనే కూరగాయలు దొరికేవి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడం, కూనవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు తెచ్చిన కూరగాయల ధరలు బాగా ఎక్కువగా ఉండడంతో వారరపుసంతలో దుకాణాలు వేసినా, కొనుగోలుదారులు లేక వ్యాపారులు తెచ్చిన సరుకులు తెచ్చినట్లే సాయంత్రం వరకు అలాగే ఉండిపోవడంతో వారు సైతం తీవ్ర నిరాశకు గురయ్యారు. వచ్చేది కార్తీకమాసం కావడం, కూరగాయల లభ్యత అంతంత మాత్రంగానే ఉండడం, మరోవైపు ధరలు విపరీతంగా పెరగడం వంటి కారణాలతో రానున్న రోజుల్లో కూర ఊసెత్తితే కష్టమయ్యే పరిస్థితి ఉత్పన్నమయ్యే పరిస్థితి వస్తుందేమోనని సీలేరు ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

మన్యంలో మంచు అందాల సోయగం



మంచు దుప్పటిలో మన్యంలోని అడవి, కొండ ప్రాంతాలు

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు సీలేరు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి రమణీయమైన మంచు అందాల దశ్యాలు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. శీతాకాలం తొలిరోజుల్లోనే మన్యంలోని అడవులతోపాటు సీలేరు మెయిన్ డ్యాం ప్రాంతాలను మంచు దుప్పటి కప్పుకున్న సహజసిద్ధమైన అందాలు ఈ ప్రాంతీయులతోపాటు సందర్శకులకు కొత్త అనుభూతిని కలగ జేస్తున్నాయి. సీలేరు ప్రాంతంలో పంట పొలాలు మంచుతో అలుముకుని బంగారు వర్ణంలో అందాలు మధురాను భూతిని మిగులు స్తున్నాయి. అలాగే సీలేరు జల విద్యుత్ కేంద్రం ఇంటెక్ డ్యాం రెగ్యులేటరీ మెయిన్ డ్యాం పరిసర ప్రాంతాల్లో మంచు అందాలతో పాటు ఆకుపచ్చ వర్ణం కలిగిన దట్టమైన అటవులు ఎత్తైన కొండలు నడుమ సహజ సిద్ధమైన అందాలు చూపరుల మనసులు హత్తుకుంటున్నాయి. ఆదివారం వేకువజామున నిత్యం వ్యాయామంలో భాగంగా సీలేరు నుంచి గుంటవాడ వరకు వాకింగ్ చేసే స్థానిక యువకులు సహజ సిద్ధమైన అందాలు ఆస్వాదిస్తూ మధురానుభూతిని పొందుతూ మైమరిచిపోయిన దృశ్యాలు ప్రజాశక్తి కంటబడ్డాయి. ఒకవైపు తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో చల్లని వాతావరణం, మరోవైపు మంచు అందాలు మైమరింపజేస్తున్నాయి.

మంచు మాటున పూల తోటల అందాలు

496 కిలోల గంజాయి పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -సీలేరు: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన అంతరరాష్ట్ర స్మగ్లర్ షేక్అప్సర్ మెహబూబ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒడిశా పోలీసులు వెల్లడించారు. ఒడిశా పోలీసులు కథనం ప్రకారం మల్కనగిరి జిల్లా కలిమెల పోలీస్‌స్టేషన్ పరిధి బెజ్జంగూడ అడవి ప్రాంతం నుంచి ఐషర్ వ్యాన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు ముందస్తు సమాచారంతో నిఘా పెట్టి, వాహనతనిఖీలు నిర్వహించగా, ఐషర్‌వ్యాన్‌లో ప్యాకింగ్ చేసిన ట్రైలలో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. వ్యాన్ డ్రైవర్ అయిన అంతరరాష్ట్ర గంజాయి స్మగ్లర్ షేక్ అప్సర్ మెహబూబ్ అదుపులో తీసుకున్నామని వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న 496 కేజీల గంజాయితోపాటు వ్యాన్‌ను సీజ్ చేశామని, ఇద్దరు నిందితులను అరెస్ట చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒడిశా పోలీసులు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాలో మరి కొంతమంది ప్రమేయం ఉందన్న అనుమానంతో ఆరా తీస్తున్నామని ఒడిశా పోలీసులు తెలిపారు.

ఒడిశా పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, సీజ్‌చేసిన వ్యాన్

నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసుల దాడులు

పులుపు ధ్వంసం

సారా బట్టీల వద్ద పోలీసులు పట్టుకున్న సామగ్రి

ప్రజాశక్తి -సీలేరు: నాటుసారా తయారీ, విక్రయాలపై నిరంతర దాడులు నిర్వహిస్తామని స్థానిక ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. సీలేరు, దారకొండ పరిసర ప్రాంతాల్లో పోలీసు బలగాలతో శని, ఆదివారాల్లో విస్తృతంగా నిర్వహించిన తనిఖీలలో దారకొండ పంచాయతీ చాకిరేవు గెడ్డ వద్ద నాటుసారా స్థావరంపై దాడిచేసి సారా బట్టీలను, బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలు చట్టరీత్యా నేరమని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెల్లం ఊటలు పారబోస్తున్న పోలీసులు

మాట్లాడుతున్న వైసిపి నేత మోహన్‌యాదవ్

నేడు పాడేరులో సాధికార బస్‌యాత్ర

ప్రజాశక్తి -కొయ్యూరు : ఈనెల 30న పాడేరులో జరగనున్న వైసిపి సామాజిక సాధికార బస్‌యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ యాదవ్ పిలుపునిచ్చారు.ఆదివారం పార్టీ ఆదేశాల మేరకుకొయ్యూరు మండలంలో పర్యటించి, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్‌పిటిసి వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. బస్సు యాత్రకు జన సమీకరణ తదితర అంశాలపై చర్చించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన గొర్లి శివాజీకు మాకవరపాలెం మండల నాయకుల సమక్షంలో చెక్కును అందజేశారు. శివాజీ అనారోగ్యానికి గురవడంతో ఎమ్మెల్యే ఉమా శంకర గణేష్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, ఆయన వెంటనే స్పందించి సీఎం సహాయనిధి నుండి రూ.2,00,000 అందజేయడం జరుగిందని కుటుంబ సభ్యులు తెలిపారు.శివాజీ తండ్రి అప్పారావు సిఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రంథాలయంలో పుస్తక పఠనం

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయధికారిని పి దమయంతి ఆధ్వర్యంలో చదవడం మా కిష్టం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలతో మాస్ రీడింగ్ కథలు వినిపించడం నేర్పించారు. సింహంరాజు తెలివి, కష్టజీవిదే గెలుపు కథలను చదివించి కథల్లో నీతిని వివరించారు. పేరాల వారిగా చదివించి, వాటిని విపులంగా వివరించారు. అనంతరం పిల్లలకు పజిల్ గేమ్ ఆడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి సిబ్బంది ఆందోళన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: ఆర్టీసీలో పని చేస్తున్న డ్రైవర్లకు, కండక్టర్లకు భద్రత కల్పించాలని ప్రజా రవాణా శాఖ వైఎస్ఆర్ ఫెడరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ గేటు ముందు నిరసన చేపట్టారు. కావలి డిపో డ్రైవర్, కండక్టర్లపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం అనకాపల్లి జిల్లా వైయస్సార్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి వి.దేముడు మాట్లాడుతూ, కావలి ఆర్టీసీ డిపో డ్రైవరు, కండక్టర్ పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డిపో కండక్టర్, డ్రైవర్ పై 14 మంది అతి కిరాతకంగా దాడి చేయడం హేయమైన చర్యని ఆయన అన్నారు. ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కశింకోట మండలం చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఆర్టీసీ సిబ్బందిపై 40 మంది దాడి చేయడం, నర్సీపట్నం డిపోకు చెందిన జిల్లేడు పూడి గ్రామానికి చెందిన రాంబాబు పై దాడి చేయడం జరిగిందని ఇటువంటి ఘటనలు పలుచోట్ల చోటు చేసుకోవడం చాలా దారుణమన్నారు.ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ సిహెచ్ గోవింద, నర్సీపట్నం డిపో ప్రెసిడెంట్ కేఎన్ రావు, జాయింట్ సెక్రెటరీ ఎల్ వై నాయుడు, తలుపులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు సత్తా

ప్రజాశక్తి -కోటవురట్ల: విశాఖలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలలో 800 మీటర్లు, 200 మీటర్లలో కోటవురట్ల జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు డేవిడ్ సత్తా చాటారు. ఈ మేరకు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ, వచ్చే నెల 9 ,10 తేదీలలో కావలి వద్ద జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఈ సందర్భంగా తెలిపారు.

బిర్సా ముండా జయంతిని జయప్రదం చేయాలి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: నవంబర్ 14,15లలో పాడేరు కేంద్రంలో జరిగే బిర్సా ముండా 149వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముక్కి శేషాద్రి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎపి జెఎసి నాయకులతో కలిసి ఆదివారం ఆయన గోడ పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషాద్రి మాట్లాడుతూ, ఈ వేడుకల్లో భాగంగా నూతన అటవీ సంరక్షణ చట్టం, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడం, జీవో 3, 1/70 చట్టం వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు జరుగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.రాంబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.జి దొర, ఆదివాసి ఉద్యమ జెఎసి నాయకులు ముక్కి రామకృష్ణ పాల్గొన్నారు.

పెదబయలు రూరల్:బిర్సా ముండ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జాయింట్ ఆక్షన్ కమిటీ సభ్యులు మర్రి రాజు కోరారు. మండల కేంద్రంలో డాక్టర్.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణం వద్ద వివిధ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హాజరై పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా గిరిజన ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం శేషాద్రి మాట్లాడుతూ, ఆదివాసీ బిడ్డలు స్వచ్ఛందంగా కదిలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల మాజీ జిల్లా అధ్యక్షులు పలాసి తిరుపతిరావు, డిటి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీముని రాంబాబు, సాగేని లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

692వ రోజుకు మత్స్యకారుల ధర్నా

ప్రజాశక్తి-నక్కపల్లి:తమకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు స్పష్టం చేసారు.హెటిరో కొత్త పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా 692వ రోజుకు చేరింది. ఆదివారం ధర్నా శిబిరం వద్ద మత్స్యకారులు పైపులైనుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. కొత్త పైపులైన్ వ్యతిరేకిస్తూ తామంతా 692 రోజుల నుండి శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, నేటి వరకు సమస్య పరిష్కారానికి మార్గం చూపక పోవడం దారుణమన్నారు. కంపెనీ వ్యర్థ జలాలను సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద వృద్ధి చెందకపోవడంతో తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డును పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.కంపెనీ ఏర్పాటు చేయకముందు వేటకు వెళితే సమృద్ధిగా చేపలు పడేవని, వాటితో కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగించేవారమన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పైప్ లైన్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మత్స్యకారులు జి.సోమేశ్వరరావు, సిహెచ్ సోమేష్, డి.నానాజీ, కె. భూలోక,కె.కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రహదారి పనులు

అవస్థలు పడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రామచంద్రపురం గ్రామ శివారు గిరిజనుల గ్రామమైన అల్లుముయ్యపాలెం గ్రామానికి సంబంధించి సుమారు 3 కోట్ల 30 లక్షల ఉపాధి హామీ నిధులతో సుమారు 5 కిలోమీటర్లు నిర్మిస్తున్న రోడ్డు పనులు గ్రామం వరకు వేసి నిలిపివేయడం పట్ల గ్రామస్తులతో పాటు మండల వ్యాప్తంగా పలువురు పలు సంఘాల నాయకులు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. గ్రామంలో ప్రధానంగా నిర్మించాల్సిన కల్వర్టు నిర్మాణం చేపట్టక పోవడంతో కొండవాలు గెడ్డను గిరిజనులు దాటి వెళ్ళవలసి వస్తుంది. అటవీ ఉత్పత్తులు, ఫలసాయం తీసుకు వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు. అదేవిధంగా పాఠశాలకు వెళ్లే దారి కూడా అదే కావడంతో కల్వర్టు లేక గెడ్డ దాటాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా గ్రామంలో మరికొన్ని చోట్ల కల్వర్టులు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నిర్మాణాలు నిలిపి వేయడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు.

సదరు గ్రామానికి వెళ్లే దారిలో భూ బకాసురులు అధికంగా ఉండటం, భూముల విలువ రేట్లు పెంచుకునేందుకే మాత్రమే రోడ్డు వేశారని పలువురు ఆరోపించారు.గ్రామంలో కల్వర్టుల నిర్మాణాలు నిలిపివేయడంతో రోడ్డు నిర్మాణం రియల్ టర్ల కోసమే వేసినట్లు ఉందంటూ చర్చించు కుంటున్నారు. రోడ్డు నిర్మాణానికి ముందు ఈ ప్రాంతంలో ఎకరా భూమి విలువ 5లక్షల నుంచి 10లక్షల వరకు ఉండేది. ప్రస్తుతం రహదారి నిర్మాణంతో అమాంతంగా 40 లక్షల వరకు చేరుకుంది. ఇక్కడ నివసించే గిరిజనులు కేవలం పోడు భూముల పైనే ఆధారపడి జీవిస్తూ ఉంటారు. వాస్తవానికి రోడ్డు సమీపంలో భూములన్ని బకాసురుల చేతుల్లోనే ఉన్నాయి. కేవలం భూమిని రియల్ ఎస్టేట్ గా మార్చే అమ్ముకోవడానికి రోడ్డు నిర్మాణం చేపట్టారని అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులు సైతం బహిరంగంగా చర్చించు కుంటున్నారు. రహదారి సమీపంలో విలువైన ప్రభుత్వ భూములు కూడా అన్యాక్రాంత మయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని గిరి పుత్రులు కోరుకుంటున్నారు.

ప్రమాదకరంగా వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో పాములవాక పంచాయితీలో ప్రధాన రహదారిని ఆనుకుని పాఠశాల వద్ద ఉన్న 40వేల లీటర్ల వాటర్ ట్యాంక్ ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టి దాదాపు 50 సంవత్సరాలు పూర్తి కావస్తుందని, ఏ క్షణాన ప్రమాదం ముంచుకొస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వాటర్ ట్యాంక్ నీరు లీకై వృధాగా పోవడంతో పాటు దిగువన పిల్లర్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తక్షణమే అధికారులు వాటర్ ట్యాంకును పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరారు.

నేరాలు ఘోరాలు

యువతి మృతి

ప్రజాశక్తి-చీడికాడ:మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరంతో యువత మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో ఎర్ర అనూష (17) గాజువాకలోని శ్రీ చైతన్య కాలేజీలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతుంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన అనూష మలేరియా, టైఫాయిడ్ డెంగ్యూ జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి -పాయకరావుపేట:స్థానిక నాగరాజు పేట రైల్వే గేట్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు రైలులో ప్రయాణిస్తూ జారిపడి మృతి చెందాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడు నలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు నెక్ టీ షర్టు ధరించి ఉన్నాడు. వీఆర్వో వెంకటేశ్వరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జోగారావు తెలిపారు.

ఉన్నత చదువులతో మంచి గుర్తింపు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్సి స్కూల్‌లో ఆదివారం ఆంధ్ర మెడికల్ కాలేజ్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక వ్యక్తి ప్రముఖ చెవి, ముక్కు వైద్య నిపుణులు కె. సంతోష్ కుమార్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు సంతోష్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ విశిష్టతను తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీని 1923 జూలై 19న ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిలో ఎంతోమంది విద్యార్థులు వైద్య వృత్తిని చదివి ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారన్నారు. భవిష్యత్తులో ఉన్నతమైన చదువులు చదివి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు

నిందితునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:కోటవురట్ల మండలం కె వెంకటాపురం గ్రామంలో రెండు రోజుల క్రితం యువతిపై అత్యాచారానికి ప్రయత్నించిన తమరాన సత్యనారాయణ పై తగు చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం (ఐద్వా) ఆదివారం డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలు ఇదివరకే వెంకటాపురంలో జరిగాయని, దీంతో గ్రామాలలో మహిళలు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నిందితలకు రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో సరైన శిక్షలు పడలేదన్నారు. బాలికలు, మహిళల హక్కుల రక్షణకు తీసుకొచ్చిన చట్టాల అమలలో ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా ఉండాలని మహిళల్లో ఆత్మస్థైరం పెంపోందించేందకు కరాటే వంటి శిక్షణలు ప్రభుత్వం పాఠాశాల స్థాయిలో నేర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు యల్ గౌరి, ట్రెజరర్ కెవీ సూర్యప్రభ, కె. ప్రసన్న, విజయ పాల్గొన్నారు.

బాధితులకు ఎంవిఆర్ సహాయం

ప్రజాశక్తి-గొలుగొండ: నిరాశ్రయులకు అండగా ఎం.వి.ఆర్ ట్రస్ట్ నిలుస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి నానాజీ తెలిపారు. గొలుగొండ మండలం గుండుపాల గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి నష్టపోయిన కుటుంబానికి ఎంవిఆర్ ట్రస్టు ద్వారా ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం, నిత్యావసర సరుకులు ఆదివారం అందజేశారు. అనకాపల్లి జిల్లాలో బాధిత ప్రజలను ఎం.వి.ఆర్ సంస్థ నుంచి ఆదుకుంటామన్నారు. ఇప్పటికే జిల్లాలో పలు సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా దేవాలయాలు అభివృద్ధి, అంబులెన్స్ ఏర్పాటు చేశామన్నారు. విద్యా వైద్య పరంగా అందుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్ కుమార్, సూర్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -గొలుగొండ:మండలంలో జోగుంపేట హైస్కూల్లో 1987- 1992 సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ కలయిక ఏర్పాటు చేశారు. దూరమైన పూర్వ విద్యార్థులు తిరిగి తాము చదివిన హైస్కూల్లోనే కలుసుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటిలో తమకు విద్యను అందించిన ఉపాధ్యాయులు ప్రకాష్ మాస్టార్ ని సత్కరించారు. అప్పటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ రోజంతా గడిపారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న బృందం సభ్యులు

డయాబెటిస్‌పై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సెంటర్ ఫర్ ఎండోక్రనాలజీ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్ గోళ్ల, అవ్యాన్ స్కిన్ హెయిర్ అండ్ లేసర్ క్లినిక్ వైద్యురాలు ఎర్రోజు శ్వేతా మాధవి సంయుక్తంగా ప్రపంచ డయాబెటిస్ డేను పురస్కరించుకుని డయాబెటిస్ కేర్ ఇన్ స్పోర్ట్స్ అండ్ ఎక్సర్‌సైజెస్ పేరిట ఆదివారం ఉదయం నగరంలోని పోర్టు స్టేడియంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులలో మానసిక ఉల్లాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ డయాబెటిస్ వ్యాధి నియంత్రణకు అవగాహన ఎంతైనా అవసరమన్నారు. టైప్ వన్ డయాబెటిస్ వ్యాధిగ్రస్తులలో అవగాహన పెంపొందించేందుకు ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించామని తెలిపారు. ఎర్రోజు శ్వేతా మాధవి మాట్లాడుతూ రోగులకు తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కాశీ విశ్వనాథ్, మైరా మీడియా ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి ఉదయ్ కొల్లి, వంద మందికిపైగా డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.

గురుద్వారాను పరిరక్షించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గురుద్వారాను పరిరక్షించాలని కోరుతూ ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కొందరు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గురుద్వారా మాజీ కార్యదర్శి సతేంద్ర సింగ్ శెట్టి మాట్లాడుతూ ప్రస్తుత గురుద్వారా అధ్యక్షుడు డిఎస్.ఆనంద్ అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. భక్తితో దాతలు ఇచ్చిన సొమ్ములు దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు. గురుద్వారాకు వచ్చే నిధులను వారి సొంత గురునానక్ ఛారిటబుల్ ట్రస్టుకు వాడుతున్నట్టు తెలిసిందన్నారు. ఈ అంశాలపై ప్రశ్నించినందుకు తనపై ఫిర్యాదు చేసి ఫోర్త్ టౌన్ పోలీసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గురుద్వారా మాజీ కార్యదర్శి బలవేంద్ర సింగ్, అమర్ దీప్ సింగ్, హర బీర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి ఫుడ్ ప్రాసెసింగ్‌లో సర్టిఫికెట్ కోర్సు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌ఎపిసిసిఐ) ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును పది రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ కోర్సుపై అక్టోబర్ 30 నుంచి నవంబర్ 9 వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ శిక్షణ ఉంటుందని సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, వినియోగదారుల పరిశ్రమ, వ్యవసాయం మధ్య సమన్వయాన్ని తీసుకువచ్చే విధంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను నడిపించడం కోసం .ఆ రంగంలో ఉన్న అనేక రకాల అవకాశాలను తెలిపేందుకు ఎంఎస్ఎంఇ రంగం ద్వారా శిక్షణా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మరింత లోతైన జ్ఞానాన్ని అందించడానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రవేశించాలనుకునే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ఉపయోగపడుతుందని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు రమ్య శ్రీని 9381893839, జీవన్‌ను 9182927627 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాధాకృష్ణ ఉత్సవాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 26వ తేదీన శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఉదయం శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో యాదవ సంఘ సమావేశం జరిగింది. దీనిలో ఆయన పాల్గొని మాట్లాడారు.

మహా పడావ్‌ను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - అనకాపల్లి

మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, వేదికపై సిహెచ్.నర్సింగరావు తదితరులు

కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దింపాలని, బిజెపికి వత్తాసు పలుకుతున్న రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేనలను ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. అనకాపల్లిలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక సంయుక్తాధ్వర్యంలో మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్ర రాజధానిలో నవంబర్ 27, 28 తేదీల్లో నిర్వహించే మహా పడావ్‌పై ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా పడావ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల హక్కులను కాలరాసి కొంతమంది పెట్టుబడిదారులకు దేశ సంపదను కట్టబెట్టాలని చూస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దించకుంటే అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేసి మనువాద రాజ్యాంగాన్ని అమలు పరిచే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ తెచ్చిన మూడు నల్ల రైతు వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని ఢిల్లీలో 13 నెలలపాటు జరిగిన మహా పోరాటాన్ని గుర్తుచేశారు. ఆ సమయంలో మోడీ ప్రభుత్వం దిగొచ్చి నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందన్నారు. అదే సమయంలో స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసిన గిట్టుబాటు ధర చట్టం తెస్తామని ఇచ్చిన హామీ నేటికీ నెరవేరలేదన్నారు. 1995 నుంచి గిట్టుబాటు ధరలు లేకపోవడంతో మూడు లక్షలా 65 వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. ప్రజలపై పన్నుల భారాలు మోపి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో ఎనిమిది లక్షల కోట్ల రూపాయలను గుంజారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం రైతుల పక్షాన కాకుండా కార్పొరేట్ సంస్థలకు చెందిన రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాల రాస్తున్నారని, పత్రికా రంగంపై దాడులు నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో సహకార రంగంలో నడుస్తున్న నాలుగు సుగర్ ఫ్యాక్టరీల్లో మూడింటిని మూసివేయడం దారుణమన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా, రైతు వ్యతిరేక విధానాలపై అందరికీ తెలియజేయాలన్నారు. తద్వారా రానున్న ఎన్నికల్లో బిజెపి, దాన్ని బలపరుస్తున్న పార్టీలను ఓడించాలన్నారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ఎపి చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ బాలు, రైతు సంఘం నాయకులు ఆర్.అప్పలరాజు పాల్గొన్నారు.

స్కేటింగ్ క్రీడాకారులకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఇంటర్ క్లబ్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ కమ్ సెలక్షన్ ట్రయల్స్ - 2023ని ఈ నెల 13 నుంచి 19 వరకు క్యాడెట్, సబ్-జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించగా పలువురు ప్రతిభ కనబరిచారు. 800 మందికిపైగా స్కేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో వివిధ విభాగాల్లోని విజేతలకు విఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర చేతులమీదుగా పతకాలు అందజేసి సత్కరించారు. రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోశాధికారి డాక్టర్ బాగిరథ కుమార్, విశాఖపట్నం డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వై.రమేష్ చంద్ర, ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

గాయనీ గాయకుల రక్తదానం

రక్తదానం చేస్తున్న గాయనీ గాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ వద్దగల రెడ్‌క్రాస్ సొసైటీ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో పలువురు కళాకారులు పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లను రెడ్ క్రాస్ కార్యదర్శి రవికుమార్ అందించారు. విశాఖ గాయనీ గాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భయ్యా శ్రీనివాస్, భూపతిరావు, ప్రతినిధులు వర్రే నాంచారయ్య, ఎంవిఆర్.నాగేశ్వరరావు, సన్ మూర్తి, ఫణి స్వామి, పట్టం వెంకటేష్, రాధారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు భయ్యా శ్రీనివాస్, భూపతిరావు మాట్లాడుతూ కొన్ని నెలల క్రితం ప్రారంభమైన తమ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ఆర్‌కె బీచ్‌లో యుబిఐ ఉద్యోగుల విజిలెన్స్ వాక్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వ విజిలెన్స్ వారోత్సవాలు - 2023లో భాగంగా యూనియన్ బ్యాంక్ విశాఖపట్నం రీజియన్ ఆధ్వర్యంలో బ్యాంకు ఉద్యోగులు ఆదివారం ఆర్‌కె బీచ్‌లో విజిలెన్స్ వాక్ నిర్వహించారు. అలాగే స్థానిక కళాశాల ప్రాంగణంలో ఉద్యోగులకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశారు. తొలుత యుబిఐ ఆర్‌కె మిషన్ శాఖ బ్యాంక్ జనరల్ మేనేజర్ జివిఎన్.భాస్కరరావు ఉద్యోగులచే అవినీతి నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి, అవినీతి రహిత భారతావని నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌కె మిషన్‌కు చెందిన స్వామి వైద్యానంద, యుబిఐ రీజినల్ అధికారి కె.దండేశ్వరరావు, ఎజిఎంలు కె.నటరాజ్, బి.రమేష్, వై.నరేష్ కుమార్, ఎల్.సుధాకర్, చీఫ్ మేనేజర్ బి.రాజశేఖర్, విజిలెన్స్ అధికారి అబ్దుల్ అజీమ్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రైవేటుపరం కానివ్వం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమని పలువురు వక్తలు స్పష్టం చేశారు. విశాఖలోని డాబాగార్డెన్స్ దరి అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన ఆదివారం స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకై సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి, కిసాన్ సంయుక్త మోర్చా రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, ద్రవిడ యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ కెఎస్.చలం హాజరై మాట్లాడారు. ప్రజల సంపదైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలకు బిజెపి పాలనలో తీవ్ర ప్రమాదం ఏర్పడిందంటూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ 'ప్రభుత్వ ఆస్తులు ఒకసారి చేజారితే వెనక్కి రావు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కుట్రలు కొనసాగుతున్నాయి. 2022 నవంబర్ 11న 'ఉక్కు'పై బిజెపి ప్రభుత్వం వేసిన వేల్యుయేషన్ కమిటీని కార్మికులు అడుగుపెట్టనివ్వలేదు. 990 రోజులుగా ప్లాంట్ ప్రైవేటుపరం కాకుండా నిలువరించగలిగాం' అని అన్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌లో కేవలం 1200 మంది ఉద్యోగులే ఉన్నప్పటికీ నాడు ప్రైవేటీకరణను అడ్డుకునేలా వారిలో సిఐటియు, సిపిఎం, వామపక్షాలు చైతన్యం కలిగించాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కుట్రలను ఎలా అడ్డుకుంటున్నదీ వివరించారు. విశాఖకు గల ప్రత్యేకతలను బట్టి పరిశ్రమలు ఏర్పాటయ్యాయని తెలిపారు. ఎన్ఎఒబి రాంబిల్లిలో రూ.2 లక్షల కోట్లతో తయారవుతోందని అన్నారు. దేశంలో 1.5 లక్షల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంటే విశాఖలోని ఎన్‌టిపిసిలో 70 వేల మెగావాట్ల ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగంలో ఉన్న దీనిపై కేంద్ర పాలకులు కుట్రలు సాగిస్తున్నారని, ఇప్పటికే 49 శాతం మేర ప్రైవేటీకరణ అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ప్రభుత్వ రంగానికి నిలయంగా ఉండేదని, కానీ తాజా లెక్కలు చూస్తే బిహెచ్‌పివిని ఎల్అండ్‌టి ఆక్రమించడం వల్ల నాలుగు వేల మంది ఉద్యోగులకుగాను నాలుగు వందలకు, పోర్టులో పిపిపి వల్ల తొమ్మిది వేల మందికిగాను మూడు వేలకు, షిప్‌యార్డులో ఏడు వేల నుంచి 700 మందికి కార్మికుల కుదింపు జరిగిందన్నారు.

సరళీకరణ విధానాలను ఓడించేందుకు జరిగే అన్ని పోరాటాల్లోనూ కార్మికవర్గం భాగం కావాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. నయా ఉదారవాద విధానాలు ఎంతటి ప్రమాదకరమో వివరించారు. విద్య, వైద్యం నేడు ప్రైవేట్ చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, ఉపాధి హామీకి దేశంలో నిధులు తగ్గిపోయాయని, సరళీకరణ విధానాలే వీటికి కారణమని అన్నారు. నవంబర్ 9కి స్టీల్‌ప్లాంట్ ఉద్యమం ఆరంభమై వెయ్యి రోజులు కావొస్తోందని.. ఈ క్రమంలో రానున్న ఆరు నెలల ఎన్నికల కాలంలో కార్మికులు 'ప్రభుత్వ రంగ పరిరక్షణ'ను పార్టీల అజెండాగా మార్చే దిశగా పని చేయాల్సి ఉందని అన్నారు. సాంస్కృతిక రంగంలో కృషి పెరగాల్సి ఉందన్నారు. కళారూపాలు, ఆటపాటల ద్వారా ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల దుష్ప్రభావాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు గడ్డుకాలం ఎదురైందని, ప్రభుత్వ ప్రోత్సాహం పూర్తిగా కరువైందని చిన్న, మధ్యతరహా పరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షులు ఎ.బాలాజీ అన్నారు. ఉత్పత్తి, రా ఖర్చులు, రా మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, దీంతో చిన్న పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులు పూర్తిగా దెబ్బతింటున్నాయని తెలిపారు. చైనాతో పోటీ పడాలని చెప్పే పాలకులు ఆచరణలో ఈ పరిశ్రమలను బతకనివ్వడం లేదన్నారు. విశాఖ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఇప్పటికే మూతపడిందని, ఆటోనగర్‌లో 1200 ఎకరాల్లో ప్రభుత్వం చిన్న మధ్య పరిశ్రమల కోసం స్థలాలు ఇవ్వగా 900 యూనిట్ల నుంచి 2000 యూనిట్లకు సంఖ్య చేరినా ప్రస్తుత పరిస్థితులతో మూతపడుతున్నాయన్నారు. మూడేళ్లుగా అనేక యూనిట్లు గోదాములుగానూ, సేవా కేంద్రాలుగానూ మారిపోయాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన భెల్ బలహీనపడడంతో 40-50 చిన్న పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. సదస్సులో పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.